

నేడు మెగా జాబ్‌మేళా

చంద్రగిరిలో నేడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. - 8లో



అభ్యసన 'మెరుగు'

ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. పేద పిల్లలు ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దుతోంది. - 8లో



కౌబాయ్‌లా వచ్చి..

ప్యాంట్, షర్ట్, టక్ చేసి పల్సర్ బైక్‌పై వచ్చాడు. ఆపై లైట్లు లేని ఇళ్లను టా ర్గెట్ చేసి దొం గతనానికి పాల్పడ్డాడు. - 8లో

సాక్షి
తిరుపతి
బుధవారం । 20 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

అందుబాటులోకి అంగన్‌వాడీలు



వెంకటగిరిలోని టీపీ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ షంషాబేగం

తిరుపతి అర్బన్: జిల్లాలో మొత్తం 2,492 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను మంగళవారానికి 2,414 కేంద్రాలు అందుబాటులోకి వచ్చినట్టు స్త్రీశిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి జయలక్ష్మి తెలిపారు. ఈనెల 12 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెబాట పట్టిన నేపథ్యంలో పాఠశాలల నిర్వహణ సచివాలయ ఉద్యోగులకు అప్పగించినట్టు వెల్లడించారు. ఈ మేరకు గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్‌రేషన్ ఇవ్వడంతోపాటు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 78 పాఠశాలలను బుధ, గురువారాల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వాహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వాహణకు సంబంధించిన ప్రణాళికలపై ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఆర్వోలు, డీఎస్పీలతోపాటు పలువురు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీల్లో విజయవాడలో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించనుందని, ఎన్నికల సంఘం సూచించిన ప్రోఫార్మాలో అవసరమైన ప్రణాళిక పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని చెప్పారు. సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచలకిషోర్, అడిషనల్ ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ అధికారులు చంద్రశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రాయలసీమ క్రికెట్ లీగ్



జెర్సీలను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు రవి ప్రభు, పార్థసారథిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ మినిస్టర్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి ఎస్వీ మెడికల్ కళాశాల మైదానంలో రాయలసీమ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నారు. ఈమేరకు రుయా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, ఏడీ రత్నరాజు, ఏవో రమేష్ మంగళవారం రాయలసీమ క్రికెట్ లీగ్ తిరుపతి జిల్లా జెర్సీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీగ్ కన్వీనర్ వరప్రసాద్, లీగ్ కో కన్వీనర్ బాలాజీ, ఆర్గనైజర్ రాజా, కోశాధికారి ఇమ్రాన్‌ఖాన్, ప్లేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో ఆరోగ్యశ్రీ



ప్రజలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలి.. పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన చికిత్సలు పొందాలి.. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా కల్పించాలి.. ఎలాంటి వ్యాధి బారిన పడినా వెంటనే ఆస్పత్రిలో చేరే పరిస్థితి తీసుకురావాలి.. నిరుపేదలు సైతం తమకు అండగా ప్రభుత్వం ఉందనే ధైర్యం అందించాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దారు .. పథకం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచుతూ ప్రజలకు ఆరోగ్య అభయం అందించారు. ఈ క్రమంలోనే వినూత్నమైన యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. సకల వివరాలను సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.

- విశిష్ట పథకంపై వినూత్న యాప్
- అందుబాటులో సమస్త సమాచారం
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సచివాలయ, వైద్య సిబ్బంది
- కుటుంబానికి ఒక మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశంసలు కురిపిస్తున్న ప్రజలు

డౌన్‌లోడ్ చేసుకుందాం ఇలా..

- ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ క్లిక్ చేయాలి.
- సెర్చ్‌లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ అని టైప్ చేయాలి.
- ఇన్‌స్టాల్ బటన్ క్లిక్ చేయాలి.
- ఆరోగ్యశ్రీ యాప్ డిస్‌ప్లే అవుతుంది.
- అనంతరం ఆధార్ నంబరు టైప్ చేయాలి.
- ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయగానే లాగిన్ అవుతారు.
- ఆస్పత్రులు అని ఉన్నచోట క్లిక్ చేయాలి.
- అవసరం మేరకు తర్వాత వచ్చే నాలుగు ఆప్షన్లు నింపాలి.
- ఈ క్లిక్‌తో సమీపంలోని ఆస్పత్రుల పేర్లు, ఆరోగ్య మిత్ర, కాంటాక్ట్ నంబర్ల ఐకాన్లు డిస్‌ప్లే అవుతాయి.
- అలాగే ఆస్పత్రులకు వెళ్లే మార్గం కూడా గూగుల్ మ్యాప్ ద్వారా చూపిస్తుంది.

చిత్తూరు రూరల్ : విద్య, వైద్యరంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యం కల్పించారు. అందులో భాగంగానే ప్రభుత్వాసుపత్రుల ఆధునికీకరణ, కొత్త పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పాటు వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వంటివి చేపట్టారు. ఈ క్రమంలోనే అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారి కోసం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. గతంలో 1,059 చికిత్సలు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండగా, ప్రస్తుతం 3,257 వ్యాధులను జాబితాలో చేర్చారు. అలాగే రూ.5లక్షల పరిమితిని రూ.25లక్షలకు పెంచడమే కాకుండా కొత్త కార్డులను సైతం యుద్ధప్రాతిపదికన ఇంటింటికీ పంపిణీ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ను కూడా ప్రభుత్వం రూపొందించింది. సామాన్యుడి అరచేతిలో అందుబాటులో ఉండేలా ఆరోగ్యశ్రీ యాప్‌ను తీర్చిదిద్దింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేయించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఈ మేరకు వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి, ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందుతున్న సేవలన్నింటినీ క్షుణ్ణంగా వివరించేలా ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం శరవేగంగా సాగుతోంది.

యాప్‌తో ఎంతో మేలు...

ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఈ పథకం సేవల పరిధి, ఏయే వ్యాధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చు, నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలను ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చు. ఎవరైనా ప్రమాదాలకు గురైనా, అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నా.. యాప్ ఉంటే ఎవరి ప్రమేయమూ లేకుండానే యాప్ ద్వారా కావాల్సిన సమాచారం తెలుసుకునే వీలుంటుంది. ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన లేని వారికి సైతం పూర్తి స్థాయిలో అర్థమయ్యేలా ఈ యాప్ రూపొందించారు. ఇప్పటి వరకూ కార్డుదారు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీ కింద పొందిన చికిత్సల వివరాలు కూడా అందులో చూసుకోవచ్చు. చికిత్స తర్వాత విశ్రాంతి సమయంలో కార్డుదారు ఖాతాలో జమయ్యే వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ఆర్థిక సహాయం మొత్తాన్ని కూడా కేసుల వారీగా తెలుసుకునే వీలుంది. చికిత్స సమయంలో కార్డుదారు పొందిన వైద్య పరీక్షల రిపోర్టులు కూడా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశముంది. అలాగే ఉచితంగా చికిత్స అందించిన నెట్‌వర్క్ ఆస్పత్రికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం జమ చేసిన మొత్తం, ఇతర వివరాలను తెలుసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,78,860 ఆరోగ్యశ్రీ కార్డుదారులుండగా, ఇప్పటి వరకు 5,14,954 మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్



ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీంతో ఆరోగ్యశ్రీకి సంబంధించిన సమాచారమంతా అరచేతిలోకే వచ్చేస్తుంది. యాప్ డౌన్‌లోడ్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే లక్ష్యం చేరుకుంటాం. అందుకే నెలాఖరు వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.
– సుదర్శన్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్, చిత్తూరు

సులభంగా సేవలు



ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడింగ్ ప్రక్రియ వేగంగా చేయిస్తున్నాం. వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. వీలైనంత త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజలకు సైతం ఈ యాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలి. దీంతో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను సులభంగా పొందవచ్చు.
– రాజశేఖర్‌రెడ్డి, ఆరోగ్య శ్రీ జిల్లా కో–ఆర్డినేటర్, తిరుపతి

గొప్ప విషయం



ఆరోగ్యశ్రీ సేవలు కూడా ఇంటి నుంచే పొందేలా చేయడం గొప్ప విషయం. యాప్‌ను వలంటీర్లు నా మొబైల్ ఫోన్‌లో డౌన్ లోడ్ చేయించారు. వాటి పనితీరు, సేవల విషయాలను వివరించారు. ఆరోగ్య రంగానికి ముఖ్యమంత్రి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈరోజు ఎలాంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు పొందుతున్నామంటే ప్రభుత్వమే కారణం.
– యుగంధర్, అశోక్‌నగర్, చిత్తూరు

ఉచితంగా వైద్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ పేదల కోసమే ఆలోచింటారు. ఖరీదైన వైద్యసేవలను సైతం ఉచితంగా చేయిస్తున్నారు. గతంలో కొన్ని వ్యాధులకు మాత్రమే చికిత్సలు ఉండేవి. ఇప్పుడు చాలా వాటికి అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్య శ్రీ సేవలు పొందుతున్నాం.
– సుమతి, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు

పేదలకు మేలు



ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షల పెంచడం ఆషామాషీ కాదు. ఇది పేదలకు ఎంతో మేలు చేస్తుంది.కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవాలంటే రూ.లక్షల్లో ఉండాలి. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఇక యాప్‌తో మరింత మేలు. –ముబీన్నీ, బీఎస్ఆర్‌పేట, చిత్తూరు మండలం

ఎంతో ఉపయోగం



పేదలకు ఆరోగ్యశ్రీ పథకం వరం. ప్రజలకు ఎంతో ఉపయోగకరం. పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో మరింత బలపేతమైంది. పైసా ఖర్చు లేకుండా చిక్సిత పొందుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో ముందుగా ఆరోగ్య శ్రీనే గుర్తుకువస్తుంది. ఇప్పుడు తీసుకువచ్చిన యాప్‌తో సులువుగా సమాచారం పొందవచ్చు.
– బేగం, బీఎస్ఆర్‌పేట, చిత్తూరు మండలం

ఎన్నో ప్రయోజనాలు



ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన కుటుంబాల వద్దకు వలంటీర్, ఏఎన్ఎం బృందం వస్తుంది. యాప్‌పై అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేయిస్తుంది. కుటుంబంలో ఒకరు అయినా తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



వైపీపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి హాజరైన స్థానికులు, లబ్ధిదారులు



తిరుపతి 48వ డివిజన్ జీవకోనలోని గురుకృప పాఠశాలలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

- జగనన్న పాలనలో రూ.1,700 కోట్లతో తిరుపతి అభివృద్ధి
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: అభివృద్ధి, సంక్షేమం సీఎం జగనన్నకు రెండు కళ్లని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. నగర పరిధిలోని 24, 48 డివిజన్లలో మంగళవారం 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయా డివిజన్లలో పార్టీ జెండా ఎగురవేసి, సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. జగనన్న పాలన బాగుందా? చంద్రబాబు పాలన బాగుందా? అని స్థానిక ప్రజలను ప్రశ్నించగా.. జగనన్నతో చంద్రబాబుకు పోలికేంటన్నా, నక్కకు నాగలోకానికి ఉన్న తేడా అని పలువురు చేతులెత్తి ముక్తకంఠంతో చెప్పారు. జగనన్నే తిరిగి సీఎం కావాలంటూ నినదించారు. అనంతరం టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కన్నా దోచుకోవడం, దాచుకోవడంపైనే చంద్రబాబు దృష్టిపెట్టారన్నారు. ప్యాకేజీల కోసం పవన్‌కళ్యాణ్ చంద్రబాబుతో పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలోనే దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడికీ సాధ్యంకానన్ని సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. రాష్ట్రంలో తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరింత సంక్షేమం అందిస్తారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక రూ.1,700 కోట్లతో తిరుపతిని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఒక్క తిరుపతి నగరంలోనే 26 వేల మంది పేదలకు సొంతింటి కళ నెరవేర్చారని తెలిపారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే తిరుపతిని మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తలారి రాజేంద్ర, కార్పొరేటర్ అన్నా సంధ్య, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పడమటి కుమార్, సురేంద్రరెడ్డి, పార్టీ నాయకులు అజయ్‌కుమార్, మహ్మద్‌రఫీ, చంద్రశేఖర్, గంగులమ్మ, గౌరి, రెడ్డెప్పరెడ్డి, రమణ, శారద, పార్వతమ్మ, సరస్వత మ్మ, దుర్గ సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

జేసీగా శుభం బన్సల్



శుభం బన్సల్, జేసీ

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన తిరుపతికి బదిలీపై రానున్నారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన బన్సల్ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం అక్కడి నుంచి తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైఎస్సార్‌సీపీలో వంద మంది చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన సుమారు వంద మంది యువకులు, మహిళలు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మెచ్చి పార్టీలో చేరినట్టు తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ సిపాయిసుబ్రమణ్యం, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు ఉన్నం వాసునాయుడు, భాస్కర్, ఫజల్, జిమ్ కరీముల్లా, కోవి చంద్రయ్యనాయుడు పాల్గొన్నారు.

భూమిపై సర్వహక్కులూ మీవే

- అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు పంపిణీ చేసిన నేదురుమల్లి



పట్టాను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: అసైన్డ్ భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద రైతులకు ఆ భూమిపై సర్వహక్కులూ కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం నేడు శాశ్వత పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలను మండల కేంద్రమైన సైదాపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సైదాపురం మండలంలో 404 మంది రైతులకు 533 ఎకరాల అసైన్డ్ భూములపై సర్వహక్కులూ కల్పిస్తున్నట్టు తెలిపారు. 2003 కంటే ముందునుంచి అనుభవంలో ఉన్న భూములకు నేడు శాశ్వత పట్టాలు ఇస్తున్నట్టు వెల్లడించారు. సీఎ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు ముగింటకే రాయితీలు వచ్చాయని, విత్తు నుంచి విక్రయం వరకు ప్రపభుత్వం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. సైదాపురం మండలంలో మరో 3వేల ఎకరాల్లో సాగు చేసుకుంటున్న రైతులకు సంక్రాంతి కానుకగా పట్టాలను అందజేస్తామన్నారు. ప్రధానంగా మేత పోరంబోకు భూములను కూడా గుర్తించి పేదలకు పట్టాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. మండల కన్వీనర్ రవికుమార్, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు గోగినేని శివకుమార్, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మండల వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, నేతలు రాఘవరెడ్డి, మాలకొండారెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్‌రెడ్డి, మనోహర్, ప్రసాద్‌రాజు, విజయభాస్కర్, వీరాస్వామి, హరి, సైదాపురం సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఇంతటితో ఆగిపోదు

భూముల పంపిణీ ఇంతటితో ఆగిపోదు. అర్హులైన వారిని తిరిగి గుర్తించి పట్టాలను అందజేస్తాం. ఇంత పెద్ద ఎత్తున భూపంపిణీ జరగడం ఎంతో ఆనందంగా ఉంది. – శ్రీనివాసులు, తహసీల్దార్, సైదాపురం

మూడు తరాలుగా ఎదురుచూస్తున్నాం

మేము ఎకరా అసైన్డ్ భూమిని సాగు చేసుకుంటున్నాం. మూడు తరాలుగా ఈ భూమిపై హక్కుల కోసం ఎదురు చూస్తున్నాం. గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయం మా కష్టానికి శాశ్వత పరిష్కారం చూపించింది. – చెరుకూరు నారాయణమ్మ, దేవరవేమూరు, సైదాపురం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం

అసైన్డ్ భూములకు పట్టాలను అందజేసిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని జగనన్న నిరూపించారు. చాలా సంతోషంగా ఉంది.
– నక్కా జ్యోతి, తురిమెర్ల, సైదాపురం మండలం

మాటంటే మాటే

పేదలు సాగు చేసుకుంటున్న అసైన్‌మెంట్ భూములకు పట్టాలిస్తారనుకోలేదు. గతంలో ప్రదక్షిణలు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. సాగు చేసుకునే కొద్ది పాటి భూమికి పట్టా ఇవ్వమని తేల్చారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.
– సరోజనమ్మ, చాగణం, సైదాపురం మండలం

అభ్యసన 'మెరుగు'!

- 21న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ట్యాబ్‌ల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు

తిరుపతి ఎడ్యుకేషన్: పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఇందులో భాగంగానే గత ఏడాది నుంచి 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఈ విద్యాసంవత్సరంలోనూ అదేవిధంగా ట్యాబ్‌లు పంపిణీ చేయడానికి చర్యలు వేగవంతం చేసింది. ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. చిత్తూరు జిల్లాలోని 352 ఉన్న పాఠశాలలతోపాటు తిరుపతి జిల్లాల్లోని 622 పాఠశాలల్లో మొత్తం 34,452 ట్యాబ్‌లను ఉచితంగా విడతల వారీగా అందించనుంది.

ఆఫ్‌లైన్‌లోనూ వీడియో పాఠ్యాంశాలు

8వ తరగతి విద్యార్థులు ఈ ట్యాబ్‌ల ద్వారా నిర్వహించే అభ్యసనాన్ని పర్యవేక్షించేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ట్యాబ్‌కు ఒకసారి చార్జింగ్ పెడితే 10 గంటలపాటు బ్యాటరీ బ్యాకప్ ఉంటుంది. ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా ఆఫ్‌లైన్‌లో వీడియో పాఠ్యాంశాలను అభ్యసించేలా ప్రీలోడెడ్ కంటెంట్‌తో ఈ ట్యాబ్‌లను అందిస్తారు. మూడేళ్లపాటు వీటికి వారెంటీ ఉంటుంది. పదో తరగతి వరకు విద్యార్థులు ఈ ట్యాబ్‌ల ద్వారా పాఠాలు నేర్చుకోవచ్చు. మధ్యలో ట్యాబ్‌ల్లో ఏదైనా సమస్య వచ్చినా సరఫరా చేసిన సంస్థ తిరిగి సరిచేసి ఇస్తుంది. పిల్లలను పక్కదారి పట్టించే ప్రమాదకర వెబ్‌సైట్‌లు ఓపెన్ కాకుండా ప్రత్యేకమైన లాకింగ్ వ్యవస్థను కూడా ట్యాబ్‌ల్లో ఏర్పాటు చేశారు. సిమ్ స్లాట్‌ను లాక్ చేసి ఉంచుతారు. ఆఫ్‌లైన్‌లో మాత్రమే బైజూస్ యాప్ ఓపెన్ అయ్యే విధంగా ఏర్పాటు చేశారు. గూగుల్ వంటివి ఓపెన్ అయినా వాటిలో కేవలం విద్యార్థులు అదనపు సబ్జెక్టు అంశాలను నేర్చుకోవడానికే అవకాశం ఉంటుంది.

ఫిర్యాదుకు అవకాశం

ట్యాబ్‌లలో ఏవైనా లోపాలుంటే సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదుల ఆధారంగా నిర్ణీత గడువులోపు సంబంధిత ట్యాబ్‌లను సరిచేసి ఇస్తారు. విద్యార్థులకు అందించే ఒక్కో ట్యాబ్ 8.7 అంగుళాల టచ్ స్క్రీన్, 3 జీబీ ర్యామ్, 32 జీబీ రోమ్ కలిగి ఉంటుంది. సరఫరా చేసిన 30 రోజుల్లోగా ట్యాబ్‌లో లోపాలుంటే దాని స్థానంలో కొత్త ట్యాబ్‌ను అందజేస్తారు. ట్యాబ్‌లో రిపేరు వస్తే ఏడు రోజుల్లోగా సరిచేసి ఇవ్వాలనే నిబంధన విధించారు.


మొదటి ఏడాదిలో అందుకున్న ట్యాబ్‌లతో తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

భారం లేకుండా..

చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు, టీచర్లకు గత ఏడాది 21,487 మందికి, తిరుపతి జిల్లాలో 21,022 మందికి ట్యాబ్స్‌ను బైజూస్ కంటెంట్‌తో ప్రభుత్వం పంపిణీ చేసింది. భౌతిక నష్టం (ఫిజికల్ డ్యామేజీ) మినహా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తితే ఎలాంటి ఖర్చు లేకుండా సరిచేసి ఇచ్చేలా మూడేళ్ల వారంటీతో వీటిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. స్క్రీన్ పగిలిపోయిన వాటికి కొత్తవి అమర్చాలంటే కనీసం రూ.5 వేల వరకు ఖర్చవుతుంది. ఇంత భారం విద్యార్థుల తల్లిదండ్రులపై పడకూడదనే ఉద్దేశంతో ఆ ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది.

21న రెండో విడత ట్యాబ్‌ల పంపిణీ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 21న చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. ఈ రెండు జిల్లాల్లో మొత్తం 10,991 ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కసరత్తును చిత్తూరు జిల్లా పరిధిలో కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి జిల్లా పరిధిలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.


చిత్తూరు జిల్లాలో ఎంఈఓలకు ట్యాబ్‌లను అందజేస్తున్న సిబ్బంది

చిత్తూరు జిల్లాలో ట్యాబ్‌ల పంపిణీ ఇలా

నియోజకవర్గం	8వ తరగతి విద్యార్థులు	పంపిణీ చేసే ట్యాబ్‌లు
చిత్తూరు	1,631	340
జీడీ నెల్లూరు	1,830	1,012
కుప్పం	3,762	680
నగరి	1,289	510
పలమనేరు	3,989	850
పుంగనూరు	2,877	1,020
పూతలపట్టు	1,977	850
మొత్తం	17,355	5,262


తిరుపతి జిల్లాలో మండలాలకు ట్యాబ్‌లను సరఫరా చేస్తున్న బైజూస్ నోడల అధికారి సురేష్

తిరుపతి జిల్లాలో ట్యాబ్‌ల పంపిణీ ఇలా

నియోజకవర్గం	8వ తరగతి విద్యార్థులు	పంపిణీ చేసే ట్యాబ్‌లు
చంద్రగిరి	2,030	969
గూడూరు	2,642	850
నగరి	963	340
సత్యవేడు	2,774	1,190
శ్రీకాళహస్తి	2,736	680
సూళ్లూరు పేట	2,824	1,020
తిరుపతి అర్బన్	1,716	170
వెంకటగిరి	1,412	510
మొత్తం	17,097	5,729

సక్రమంగా వినియోగించాలి


విద్యార్థులు విజ్ఞానవంతులుగా ఎదగాలని, వారికి ఉత్తమ భవిష్యత్ అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ట్యాబ్స్‌ను అందిస్తోంది. వాటిని సక్రమంగా వాడుకోవాలి. సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేందుకు యంత్రాంగం కూడా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇబ్బందులుంటే స్థానిక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేసి సరిచేసుకోవచ్చు.
– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు జిల్లా

ట్యాంపర్ చేస్తే ఐటీ సెల్‌కు అలర్ట్


ఈ ట్యాబ్‌లు ప్రత్యేకంగా రూపొందించారు. వీటిల్లోని కంటెంట్ ఇంటర్నెట్ లేకుండానే వినియోగించుకోవచ్చు. సబ్జెక్టుల వారీగా ఉన్న పాఠ్యాంశాలను విద్యార్థి ఎన్ని గంటలు చూశారు, ఏ సబ్జెక్టు కోసం ఎక్కువ సమయం కేటాయించారో అందులో నమోదవుతుంది. ట్యాబ్స్‌ను నెట్(వైఫై)కు అనుసంధానం చేయగానే మొత్తం వివరాలు స్టేట్ ఐటీ సెల్‌కు చేరుతాయి.
– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

నవశకానికి నాంది


ప్రభుత్వం విద్యారంగంలో నవశకానికి నాంది పలికింది. విద్యార్థుల అవసరాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చర్యలు చేపడుతోంది. చిత్తూరు జిల్లాలో ఈ నెల 21న రెండో ఏడాది ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు మొదటి దశలో వచ్చిన ట్యాబ్‌లను 31 మండలాలకు పంపిణీ చేశాం.
– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ఎంతో దోహదం


అభ్యసనకు ట్యాబ్‌లు ఎంతగానో దోహదం చేస్తాయి. తిరుపతి జిల్లా పరిధిలో మొదటి దశలో అందజేసిన ట్యాబ్‌ల వల్ల విద్యార్థుల సామర్థ్యాలు పెరిగాయి. ఈ విధానం వల్ల విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటమే కాకుండా, భవిష్యత్‌లో దేశ, విదేశాల్లో బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.
– శేఖర్, డీఈఓ, తిరుపతి

క్లుప్తంగా

గవర్నర్‌కు సాదర వీడ్కోలు


రేణిగుంటలో గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, ఇతర అధికారులు

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రెండు రోజుల తిరుపతి, తిరుమల పర్యటన ముగించుకుని మంగళవారం సాయంత్రం రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి రైలులో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు ఆయనకు రైల్వే స్టేషన్‌లో జిల్లా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, పద్మావతి విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ భారతి, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి తదితరులు సాదర వీడ్కోలు పలికారు.

బాత్‌రూంకు వెళ్లి.. బక్కెట్‌లో పడి!

- నారాయణ స్కూల్ పీఈటీ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

తిరుపతి రూరల్: బాత్‌రూమ్‌కు వెళ్లిన ఓ టీచర్ మూర్ఛ రావడంతో బక్కెట్‌లో తల పడి మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ మండలం, కాలూరులోని నారాయణ స్కూల్లో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి కథనం.. చౌడేపల్లి మండలం, కుర్రపల్లికి చెందిన నటరాజన్(28) బీఎస్సీ, బీపీఈడీ పూర్తి చేసుకుని పీఈటీగా పనిచేస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం, కాలూరులోని నారాయణ బాయ్స్ స్కూల్లో గత ఆరు ఏళ్లుగా పీఈటీగా ఉన్నారు. మంగళవారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లిన నటరాజన్ లోపల గడి పెట్టుకుని ఉన్నాడు. సాయంత్రం అయినా కనిపించకపోవడంతో హాస్టల్‌లో వెదికారు. బాత్‌రూం లోపల గడిపెట్టి ఉండడంతో పగలగొట్టి చూడగా బాత్‌రూంలో ఉన్నప్పుడు ఫిట్స్ రావడంతో తలను కిందకు వంచడం, అదే సమయంలో అక్కడ బక్కెట్ ఉన్నట్లు గుర్తించారు. స్కూల్ యాజమాన్యం తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించింది. సీఐ సుబ్రమణ్యం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.

తిరుచానూరులో భారీ చోరీ



దుండగులు చోరీకి పాల్పడిన ఇల్లు, ఇంటి తలుపులను బద్దలు కొట్టిన దొంగలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో భారీ చోరీ చోటు చేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు బంగారంతో పాటు నగదును దోచుకెళ్లిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుచానూరు పరిధిలోని వీవీ నగర్‌కు చెందిన ఖాదర్‌వల్లీ ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపారి. సోమవారం రాత్రి ఖాదర్‌వల్లీతో పాటు కుటుంబ సభ్యులు మొదటి అంతస్తులో నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తలుపులను బద్దలకొట్టి అక్రమంగా ఇంట్లోకి చొరబడి పడకగదిలోని బీరువా వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న తాళాలతో బీరును తెరిచి అందులోని సుమారు 500 గ్రాముల బంగారు ఆభరణాలు, పెద్ద మొత్తంలో నగదును దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంట్లోకి వచ్చి చూడగా తలుపులు బద్ధలు కొట్టినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన క్లూజ్ టీం అధికారులు వేలిముద్రలు సేకరించారు. క్రైం డీఎస్పీ, సీఐలతో పాటు తిరుచానూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న పద్యనాటకాలు


ఆకట్టుకున్న శ్రీకృష్ణలీలలు నాటకం

తిరుపతి కల్చరల్: ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ 60వ వార్షిక కళోత్సవాల్లో భాగంగా తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలలో రెండో రోజైన మంగళవారం ప్రదర్శించిన సాంఘిక, పౌరాణిక పద్య నాటకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమదైన శైలిలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. సాయంత్రం అనకాపల్లి సంఘమిత్ర ఆర్ట్ థియేటర్ వారు ప్రదర్శించిన దానానికి దారులెన్నో సాంఘిక నాటిక అలరింపజేసింది. శ్రీసాయి సంతోషి నాట్యమండలి సురభి వారు ప్రదర్శించిన శ్రీకృష్ణలీలలు పద్యనాటకం పౌరాణిక గొప్పతనాన్ని చాటింది. కళాకారులను జ్ఞాపికలు, పారితోషికంతో ఘనంగా సత్కరించారు. టీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నేత చీర్ల కిరణ్, కళాకారుడు ఆమూరి సుబ్రమణ్యం, ఆలిండియా రేడియో రిటైర్డ్ డైరెక్టర్ ఆకుల మల్లేశ్వరరావు, రంగస్థలి చైర్మన్ గండాల గోపీనాథ్‌రెడ్డి అతిథులుగా హాజరై కళాకారులను సత్కరించారు. ఎస్ఆర్ నాట్య కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, సిద్ధేంద్రశర్మ, కె.కేశవులురెడ్డి పాల్గొన్నారు.

మృతురాలు దామినేడువాసి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం సమీపంలో పంట కాలువలో లభ్యమైన మృతదేహం దామినేడుకు చెందిన విద్యాలత(21)దిగా గుర్తించినట్లు రూరల్ సీఐ అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మృతురాలి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ఆమె తల్లి ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని చూసి తన కుమార్తెదిగా నిర్ధారించినట్లు సీఐ పేర్కొన్నారు. కాగా విద్యాలతకు ఏడేళ్ల కిందట నెల్లూరు జిల్లా, రాపూరుకు చెందిన రమేష్‌తో వివాహం జరగగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో ఆమె భర్తకు దూరంగా ఉంటున్నట్లు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 61,499 మంది స్వామి వారిని దర్శించుకోగా 24,789 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నగరిలో రాధాకృష్ణ, రామోజీ నిల్చుంటారా?

- మంత్రి ఆర్‌కే రోజా ధ్వజం


తిరుమల ఆలయం వెలుపల మంత్రి ఆర్కే రోజా

తిరుమల: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 కి 175 సీట్లు పక్కాగా గెలుస్తుందని మంత్రి ఆర్‌కే రోజు ధీమా వ్యక్తం చేశారు. ఆమె మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి రోజా మీడియాతో మాట్లాడుతూ తాను నగరి నియోజకవర్గంలో రోజూ గడపగడపకు వెళుతూ పల్లెనిద్ర చేస్తున్నానని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో ముందుంటున్నానన్నారు. అందుబాటులో ఉన్నాం కాబట్టే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రినయ్యానని చెప్పారు. నగరిలో రోజాకు సీటు లేకుంటే రాధాకృష్ణ నిల్చుంటాడా.. రామోజీరావు నిల్చుంటాడా.. అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో నిలబడడానికే భయపడుతున్నారన్నారు. నగరిలో ఎవరికి టికెట్ ఇచ్చినా.. తాను జగన్ అన్నకు తోడుగా ఉంటానని రోజా స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్యే సీటు లేదనే ప్రచారం కేవలం శునకానందమేనని అన్నారు. పచ్చ మీడియా దిగజారుడు వార్తలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి 100 శాతం పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు.

నేడు చంద్రగిరిలో మెగా జాబ్ మేళా




మెగా జాబ్ మేళా నిర్వహణపై కమిటీలకు దిశానిర్దేశం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, జాబ్‌మేళాకు ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లు

- ఏర్పాట్లను పర్యవేక్షించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: నిరుద్యోగ సమస్య రూపుమాపడానికి తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నడుం బిగించారు. ఇందులో భాగంగా బుధవారం చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాల వేదికగా 33 మల్టీ నేషనల్ కంపెనీలతో 'వైఎస్సార్ మెగా జాబ్ మేళా' నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు నిరంతర పర్యవేక్షణకు 9 కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 3,500 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. సీఎం జగనన్న పుట్టిన రోజు సంబరాలలో భాగంగా నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విచ్చేసిన ప్రతిఒక్కరికీ భోజన ఏర్పాట్లు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


పాల్గొననున్న కంపెనీలు ఇవే

కున్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్, అమర రాజా, అపోలో ఫార్మసీ, అపోలో హోమ్ కేర్, ఎస్‌బీఐ పేమెంట్స్, డీ మార్ట్, డిస్నీ ప్రో సొల్యూషన్స్, టెలి పెర్ఫార్మెన్స్, లాంకో, డైకిన్ ఎయిర్ కండిషనింగ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, హావెల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మల్లాడి డ్రగ్స్ ఫార్మసీ, నవభారత్ ఫెర్టిలైజర్స్, కార్బన్, ఎవర్ గ్రీన్ సెక్యూరిటీ సర్వీసెస్, శ్రీరామ చిట్స్ తదితర కంపెనీలు పాల్గొననున్నాయి.

కౌబాయ్‌లా వచ్చి..తాళాలు పగులగొట్టి!

- రెండు ఇళ్లల్లో చోరీ
- ఐదు కిలోల వెండి దోచుకెళ్లిన దొంగ

తిరుపతి రూరల్: తలకు టోపీ, నీట్‌గా టక్, చేతులకు గ్లౌజ్‌లు, మూతికి మాస్క్ ధరించి పల్సర్ బైక్‌పై కౌబాయ్ లా వచ్చాడు. లైట్లు వెలగని ఇళ్లను చూసి తాళాలు పగులగొట్టి ఐదు కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి బైక్‌పై సింగిల్‌గా వచ్చిన దొంగ తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట ప్రియదర్శిని కాలనీ, వినాయకనగర్‌లో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే.. తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట పంచాయతీలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన పూజారి కుటుంబం మూడు రోజుల క్రితం తీర్థయాత్రల్లో భాగంగా అన్నవరం వెళ్లారు. తాళాలు వేసిన ఇంట్లోకి సోమవారం అర్ధరాత్రి దొంగ వచ్చి తాళాలు పగులగొట్టి బీరువాలోని వెండి వస్తువులను దోచుకెళ్లాడు. అలాగే వినాయక నగర్‌లోనూ ఓ ఇంట్లో దూరి అక్కడ కూడా ఇలాగే బీరువాను పగులగొట్టి అక్కడ వెండితో పాటు కొన్ని విలువైన వస్తువులను దోచుకెళ్లాడు. మంగళవారం ఉదయం గుర్తించిన స్థానికులు తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ మూర్తితో సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎక్కడా ఫింగర్ ప్రింట్లు దొరక్కపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. టోపీ, మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించి బైక్‌పై వచ్చిన దొంగ ఇళ్లకు కన్నం వేసినట్లు గుర్తించారు. రెండు ఇళ్లకు సంబంధించిన వ్యక్తులు సుదూర ప్రాంతాల్లో ఉండటంతో మంగళవారం సాయంత్రం వరకు కూడా ఫిర్యాదు ఇవ్వలేదు. బుధవారం ఫిర్యాదు ఇచ్చే అవకాశం ఉంది. బాధితులు వస్తే గానీ ఎంత మేరకు సొత్తు, వస్తువులు చోరీకి గురయ్యాయో తెలియదని తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.


వినాయక నగర్‌లో చోరీ జరిగిన ఇల్లు

కుక్కకు విషం ఇచ్చాడా?

ప్రియదర్శిని కాలనీలోకి దొంగ ప్రవేశించే సమయంలో వీధిలోని మూడు కుక్కలు వెంటపడ్డాయి. ఈ సంఘటన సీసీ కెమెరాల్లో నమోదైంది. అయితే అందులోని ఓ కుక్క రోడ్డుపైన మృతిచెందడం సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దొంగ కుక్కకు విషం ఇచ్చి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ మందరాణి మంగళవారం తెలిపారు. నోటిఫికేషన్‌లో జేఎల్(ఫిజిక్స్)01 (ఎస్సీ మహిళ), జేఎల్ (కెమిస్ట్రీ)01 (ఎస్సీ మహిళ), పీజీటీ, సోషియల్ స్టడీస్-01 (ఎస్సీ, మహిళ), ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ 01 (ఓసీ, పీహెచ్‌సీ మహిళ) పోస్టులను తాత్కాలిక ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జేఎల్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో సెకండ్ క్లాస్ మార్కులతో ఉత్తీర్ణత, బీఈడీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉందన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పోస్టుకు 10వ తరగతి పాసై, ఆర్ట్ కోర్సులో డిప్లొమో హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్ టీచర్ సర్టిఫికెట్, సంబంధిత ట్రేడ్ జారీచేసిన ఐటీఐ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంగ్లిస్ మీడియం చదివి ఉండాలని, ఏపీ టెట్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. దరఖాస్తులు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల విద్యాలయాల్లో లభిస్తాయని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 22వ తేదీ లోపు రేణిగుంట గిరిజన గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈనెల 30న అదే పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.